క్లుప్తంగా

వాహనాల తనిఖీ



నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హైవే నుంచి నగరంలోకి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మద్యం, నగదు, మారణాయుధాలను రవాణా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎవరైనా మద్యం, నగదు, కానుకలను పంపిణీ చేస్తుంటే తగిన ఆధారాలతో సీ విజిల్ మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పాల్గొన్నారు.

కిర్రాక్ ఆర్పీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): జబర్దస్త్ ఫేమ్ కిర్రాక్ ఆర్పీపై దర్గామిట్ట పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వివరాలు..గత కొంతకాలంగా కిర్రాక్ ఆర్పీ టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అనుచరుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా ఎవ్వరు మాట్లాడినా కౌంటర్ ఇవ్వసాగారు. ఈ నేపథ్యంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నేతలపై ఆయన తీవ్ర స్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉండటంతో కిర్రాక్ ఆర్పీపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు రెండ్రోజుల కిందట దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను విచారిస్తున్నారు.

అంధ విద్యార్థినికి చేయూత



నెల్లూరు సిటీ: తిరుపతికి చెందిన అంధ విద్యార్థిని సుమతి ఉన్నత చదువుకు వీకేర్ మిషన్ చేయూత నందించింది. నిరుపేద కుటుంబానికి చెందిన సుమతి తిరుపతిలోని శ్రీపద్మావతి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో మాస్టర్ డిగ్రీ చదువుతోంది. తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఉన్నత విద్యకు సాయం అందించాలని ఐకేర్ మిషన్‌ను సంప్రదించింది. ఈ మేరకు ఐకేర్ మిషన్ కోశాధికారి ప్రశాంత్‌కుమార్ సోమవారం నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సుమతికి రూ.12వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హజరత్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సిబ్బంది అప్రమత్తతతో పెనుముప్పు తప్పింది. నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో కార్పొరేషన్ డ్రైనేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆదివారం నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. అక్కడ ఉన్న ఎండుగడ్డికి నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. గమనించిన విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను అదుపు చేయడంతో పెనుముప్పు తప్పింది. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా మంటలు ఎగిసిపడి ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకుని పెనుప్రమాదం సంభవించి ఉండేది.

ఆదాలపై పాట విడుదల



నెల్లూరు సిటీ: ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై నగర దివ్యాంగుల కమిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్ తన స్వీయ రచనలో నూతన పాటను రూపొందించారు. ఈ పాటను మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై సమీక్ష

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీవీనగర్‌లోని డేమియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్టులో క్షయ నివారణపై సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఎస్కే ఖాదర్‌వలీ క్షయ వ్యాధి, నివారణ, క్షయ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. భవ్య, టీబీ నివారణ, డీఎఫ్ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

నెల్లూరు(క్రైమ్): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక సహాయ అధికారి ఎస్ వేణుగోపాల్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పార్టీలో పాతవెల్లంటివాసులతో ఆదాల

నెల్లూరు సిటీ : నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరులో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ చంద్ర ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతిఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తొలుత ఆదాలకు గ్రామస్తులు పూలవర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. స్థానిక నాయకులు అంబటి వెంకటనారపరెడ్డి, ఒంటేరు దయాకర్, గోపి, శీనయ్య, ములుముడి మధురెడ్డి, శివ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

38,41 డివిజన్‌ల జనసేన ఇన్‌చార్జుల చేరిక

38 ,41 డివిజన్‌ల జనసేన ఇన్‌చార్జులు సునీల్‌కుమార్, నాగరాజు ఆ పార్టీని వీడారు. తమ అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి నగరంలోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీ మద్దతుదారుల చేరిక

పాతవెల్లంటికి చెందిన 50 కుటుంబాల టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పాదర్తి మల్లికార్జున, చిడదల గణేష్, కొత్తప్రసాద్, పాదర్తి వెంకటకృష్ణయ్య, జువ్వల ఆదిశేషయ్య, పాదర్తి అనిల్, పాదర్తి పుల్లయ్య, వనం ప్రసాద్, వనం కృష్ణయ్య, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, మాశెం సుధీర్‌కుమార్ రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, విజయ్‌కుమార్‌యాదవ్, వేలూరు శివసునీల్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి , మాజీ ఎంపీటీసీ పాదర్తి సుధాకర్, పెట్లూరు వెంకటేష్, గుడి సురేంద్ర, గంపల శీనయ్య, పల్లంరెడ్డి మధురెడ్డి, రాపూర్ అంకయ్య, బండి బుజ్జయ్య, గంపల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

- 41వ డివిజన్‌కు చెందిన 50 కుటుంబాల టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. 41వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు బాబ్జీయాదవ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆదాలకు మద్దతు ఇస్తున్న ఆర్ఎంపీలు



పార్టీలో చేరిన జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఆర్ఎంపీల మద్దతు

వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి నెల్లూరు జిల్లా ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మద్దతు ప్రకటించారు. సోమవారం వారు ఆదాలను నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్ఎంపీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఆదాలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

రూరల్ అభివృద్ధే ఆదాల లక్ష్యం

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన తండ్రి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుమార్తె ఆదాల హిమబిందు పేర్కొన్నారు. సోమవారం ఆమె తన తండ్రికి మద్దతుగా 29వ డివిజన్, వెంకటరెడ్డినగర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ సత్తార్, నాయకులు కన్వీనర్ కొండా సాయిరెడ్డి, రావుల వెంకటజ్యోతి, సూరిబాబు, షేక్ జాకీర్, ఆర్ అమరనాథ్, హరిరెడ్డి, రజిని, ప్రభాకర్‌రెడ్డి , నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదాల హిమబిందు

పకడ్బందీగా ఎన్నికల విధులు

- నెల్లూరు సిటీ ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల శిక్షణను పూర్తి చేసుకున్న పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి/కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి రెండ్రోజుల పాటు నిర్వహించిన రెండో విడత ఎన్నికల శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు పీఓ, ఏపీఓలు, సెక్టార్ అధికారులకు ఎన్నికల విధులపై మాస్టర్ ట్రెయినర్స్ ద్వారా రెండ్రోజుల పాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పొరపాట్లు జరిగితే అప్పటికప్పుడు సరిద్దుకోలేమని, శిక్షణలోనే విధులపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని పరిశీలించేందుకు ఎన్నికల అధికారులకు నమూనా పరీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్వో వికాస్‌మర్మత్

పేదలకు తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం

నెల్లూరు(అర్బన్): సింహపురి వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అతితక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా దేవిరెడ్డి శారద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నామని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బీవీనగర్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో దేవిరెడ్డి శారద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన అల్లూరు మండలంలో తన భార్య దివంగత శారద పేరుతో ఇప్పటికే ఆస్పత్రి, ఉన్నత పాఠశాలను నిర్మించి పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. నెల్లూరులో సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో జయభారత్ ఆస్పత్రి పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందిస్తోందన్నారు. అదే విధంగా నెల్లూరులో పేదలకు తక్కువ ఖర్చుతో మంచి వైద్యం అందించేందుకు తన సోదరులతో కలిసి తాను ముందుకొచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, టీడీపీ నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ సహ క్షేత్ర సంఘ చాలకులు దూసి రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ సహ క్షేత్ర ప్రచారక్ భరత్, ప్రాంత ప్రచారక్ ఆదిత్య, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి హరికుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సుబ్బారావు, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, జై భారత్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి

న్యాయమూర్తులకు వీడ్కోలు



సత్యవాణిని సత్కరిస్తున్న న్యాయవాదులు



లక్ష్మీనారాయణకు జ్ఞాపిక బహూకరణ

నెల్లూరు(లీగల్): నెల్లూరు రెండో అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సీ సత్యవాణి అనంతపురం మొదటి అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా, నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బీ లక్ష్మీనారాయణ కృష్ణా జిల్లా గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారికి వీడ్కోలు సభను నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి సిరిపి సుమ ముఖ్యఅతిథిగా హాజరై వారు సేవలను కొనియాడారు. న్యాయమూర్తులు సత్యవాణి, లక్ష్మీనారాయణను న్యాయవాదులు పూలమాలలు, బొకేలు, శాలువాలతో సత్కరించారు. బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధానకార్యదర్శి సుందరయ్యాయాదవ్ , తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామనవమి వేడుకలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5.30 గంటలకు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6 నుంచి షిర్డీ సంప్రదాయంగా సాయినాథుని దివ్యరథోత్సవం, వెండిపల్లకి సేవ, ముస్లింల గంధ మహోత్సవం, జెండా ఉత్సవం విశేషంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ శ్రీసాయినామ సంకీర్తన జరుగుతుందని తెలిపారు.

నేలనూతల స్మారకోపన్యాసం నేడు

నెల్లూరు(బృందావనం): ప్రముఖ సాహితీవేత్త నేలనూతల శ్రీకృష్ణమూర్తి 19వ స్మారకోపన్యాసాన్ని పురమందిర ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) స్మారక భవనంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ సమాజం అధ్యక్ష,కార్యదర్శులు పొన్నాల రామసుబ్బారెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ పండితుడు విద్వాన్ ఆలూరి శిరోమణిశర్మ 'నేలనూతల శ్రీకృష్ణమూర్తి ఆదర్శజీవితం సందేశం'పై ఉపన్యసిస్తారని చెప్పారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీఎం జగన్‌పై దాడి హేయం



నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి హేయమని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా ఖండించారు. సోమవారం ఆయన నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో జగన్‌పై గెలవలేమని ప్రతిపక్ష పార్టీలు రౌడీమూకలతో రాళ్ల దాడి చేయించడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదన్నారు. దాడి చేసిన వారిని గుర్తించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీఎంకు మద్దతుగా ప్రచారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్‌కు మద్దతుగా ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య సోమవారం విస్తృత ప్రచారం చేపట్టారు. 39, 40 డివిజన్ల పరిధిలోని తిరుచిపేట, చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, దయాకర్, తిరుపాలు తదితరులు, పాల్గొన్నారు.

పోలింగ్ శిక్షణా తరగతుల పరిశీలన

నెల్లూరు(దర్గామిట్ట): పోలింగ్ సిబ్బంది ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ సూచించారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల, వీఆర్ లా కళాశాలల్లో నిర్వహిస్తున్న పోలింగ్ శిక్షణా తరగతులను కలెక్టర్ హరినారాయణన్ సోమవారం పరిశీలించారు. డీకేడబ్ల్యూలో శిక్షణకు హాజరైన పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీఆర్ లా కళాశాలలో శిక్షణానంతరం పరీక్ష రాస్తున్న సిబ్బందిని ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను అడిగి ఏ మేరకు శిక్షణ పొందారో పరిశీలించారు. ఈవీఎంపై పోలింగ్ సిబ్బందికి ఇస్తున్న శిక్షణను కలెక్టర్ దగ్గరుండి పరిశీలించారు. పోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ విధులను నిర్వర్తించాలని, ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట నెల్లూరు, నెల్లూరురూరల్ రిటర్నింగ్ అధికారులు వికాస్, మలోల, ఏఆర్ఓ జీవీ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.



పోలింగ్ శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

అభివృద్ధి ప్రదాతను ఆశీర్వదించండి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తన భర్త నెల్లూరు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించారని, అందులోని హామీలను వంద శాతం నెరవేరుస్తారని, నెల్లూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సతీమణి సునంద విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 15వ డివిజన్, బాలాజీనగర్‌లో తన కుమార్తె నేహారెడ్డి, స్థానిక కార్పొరేటర్ గణేశం సుజాతమ్మతో కలిసి సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ముత్తుకూరు మండలం తాళ్లపూడి తమ స్వగ్రామమని, తన భర్త విజయసాయిరెడ్డి పుట్టి, పెరిగింది అక్కడేనని తెలిపారు. తాళ్లపూడి గ్రామాన్ని తాము అభివృద్ధి చేశామని, అంతకుమించి నెల్లూరును అభివృద్ధి చేస్తామన్నారు. విజయసాయిరెడ్డి హామీ ఇస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ అది నెరవేరుస్తారని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కర్తం జ్యోతి, బెందాళం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సునంద

నిరంతర నిఘాతో మద్యం, నగదు కట్టడి

నెల్లూరు(క్రైమ్): నిరంతర నిఘాతో సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, నగదును కట్టడి చేయాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పోలీసులను ఆదేశించారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, ఇరుకళలపరమేశ్వరి గుడి సమీపంలోని చెక్‌పోస్టులను సోమవారం రాత్రి ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నగరంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద క్షుణ్ణంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా తరలించే నగదును సీజ్‌చేసి ట్రెజరీ, ఆదాయ పన్నుశాఖ అధికారులకు అప్పగిస్తున్నామన్నారు. మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై దాడులు చేసి నిందితులపై కేసులు నమోదు చేస్తునామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ప్రజలు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకెళ్లాల్సి వస్తే సంబంధిత ఆధారాలు, ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో నగరంలోని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా నడుచుకోవాలని, ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ఉల్లంఘనపై సీ విజిల్ యాప్, టోల్‌ఫ్రీ నంబర్ 112 లేదా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని కోరారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

యువతకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

నెల్లూరు (మినీబైపాస్): యువతకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఐవైఎం రాష్ట్రాధ్యక్షుడు కరీముల్లాఖాన్ కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. యువత ఉజ్వల భవిష్యత్ కోసం గత కొన్నేళ్లుగా ఐవైఎం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు సాగిస్తోందన్నారు. యువసాధికారత కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ప్రతి జిల్లాలో ఫ్రీకోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యువత మత్తుకు బానిస కాకుండా డ్రగ్స్, మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలన్నారు. ఉర్దూ అకాడమీకు ఏటా బడ్జెట్‌లో రూ.25 కోట్లు కేటాయించాలని కోరారు. ఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్సర్, మీడియా కార్యదర్శి ఇస్మాయిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు సాజిద్, నగర ఉపాధ్యక్షుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం జనచైతన్య యాత్ర

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు జనచైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని అరుణోదయ సంస్థ వ్యవస్థాపకులు విమలక్క తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధానిపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు మే 15వ తేదీ వరకు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కర్నాకుల వీరాంజనేయులు, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

జీవాత్మ, పరమాత్మల సంయోగమే సీతారాములు

నెల్లూరు(బృందావనం): జీవాత్మ, పరమాత్మల సంయోగమే సీతారాములని విద్వాన్ డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు.పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రేబాలవారి వీధిలోని పీటీజీ టవర్స్‌లో నిర్వహిస్తున్న శ్రీరామ కథా తరంగిణి సప్తాహంలో భాగంగా ఐదో రోజు సోమవారం 'సుందరకాండం'పై ఆయన ఉపన్యసించారు. శ్రీమద్రామాయణం మన భారతీయ సంస్కృతి, ఉత్తమ జీవన విధానాన్ని తెలియజేస్తుందన్నారు. సుందరకాండ ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలను బోధిస్తుందన్నారు. హనుమంతుడనే మనస్సు జీవిత్మైన సీతామాత జాడ తెలుసుకుని పరమాత్ముడైన శ్రీరామచంద్రుడికి నివేదించి ఆయన హృదయంలో స్థిరమైన స్థానం పొందాడన్నారు. అలాగే సీతారాముల, లంకా సౌందర్యం, రావణాసురుడి రూపం,ధైర్యం, తేజస్సు, గాయత్రి మంత్రం తదితర విషయాలెన్నో సుందరకాండలో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. ఈ సభకు పోలవరపు లక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహించగా సభాపోషకులుగా చక్కిరాల జయప్రసాద్, ధూర్జి సుబ్రహ్మణ్యకుమార్ వ్యవహరించారు. సాహితీ ప్రముఖులు శింగరాజు శ్రీరామకృష్ణప్రసాద్‌రావు, శతావధాని కొండపి మురళీకృష్ణ, అవధాని కోట రాజశేఖర్, కోట శ్రీరామమూర్తి, అన్నవరం సత్యానారాయణ, రామాంజనేయులు, ఎస్ కృష్ణమూర్తి, స్వామి సమయానంద తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి వెంకటేశ్వరరావుకు సత్కారం

దళితుల పక్షపాతి సీఎం జగన్

నెల్లూరు సిటీ: దళితుల పక్షపాతి అయిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నేత, రైల్వేబోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య అన్నారు. రూరల్ మండలం కందమూరు ఎస్సీ కాలనీలో స్థానిక దళిత నాయకులు, ప్రజలతో సోమవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రానుందన్నారు. వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దళిత నాయకులు బద్దెపూడి రవీంద్ర. ఆనందరావు, బద్దెపూడి వెంకటరావు, ఎం శ్రీనివాసులు, బెల్లంకొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు